



సబ్బవరం మండలం బాటజంగాలపాలెం హైవేపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

హాస్టళ్లలో ఆకలి కేకలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వసతిగృహాలకు నవంబరు నుంచి అందని డైట్ బిల్లులు

- మొత్తం విద్యార్థులు పది వేల మంది
- రూ.6 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- అరువుపై సరుకులు తెచ్చి.. నెట్టుకొస్తున్న వార్డెన్లు

- సక్రమంగా అమలుకాని మెనూ
- బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని పౌష్టికాహారం
- ఎన్నికల నేపథ్యంలో పెండింగ్ బిల్లులపై వార్డెన్లు ఆందోళన

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పదేపదే గొప్పలు చెప్పుకొనే వైసీపీ పాలకులు... వసతిగృహాల్లో వుంటూ చదువుకుంటున్న బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల భోజనం (డైట్) బిల్లులను నెలల తరబడి చెల్లించడం లేదు. ఆయా హాస్టళ్ల వార్డెన్లు ప్రతి నెలా క్రమం తప్పకుండా సకాలంలోనే మెస్ బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం గత ఏడాది నవంబరు నుంచి నిధులు విడుదల చేయడంలేదు. మొత్తం రూ.6 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. ఫలితంగా వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందని పరిస్థితి నెలకొంది. హాస్టళ్ల నిర్వహణకు అప్పులు చేయాల్సి వస్తున్నదని వార్డెన్లు వాపోతున్నారు.

జిల్లాలో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 50 వసతిగృహాల్లో సుమారు 3,194 మంది విద్యార్థులు వున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 32 వసతిగృహాలు వుండగా వీటిలో 2,910 మంది విద్యర్థులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లలో 16 వసతిగృహాల్లో 3,992 మంది.. మొత్తం 10,096 మంది విద్యార్థులు వుంటున్నారు. వీరు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ మధ్యాహ్న భోజనం స్కూళ్లలో, ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం వసతిగృహాల్లో చేస్తున్నారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో రెండు పూటలా భోజనం, అల్పాహారం వసతిగృహాల్లోనే సమకూర్చాలి. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం పదో తరగతి లోపు విద్యార్థులకు నెలకు రూ.1,400, పదో తరగతి పైబడిన విద్యార్థులకు రూ.1,600



నర్సీపట్నం బాలికల వసతిగృహంలో భోజనాలు వడ్డిస్తున్న సిబ్బంది

చొప్పున మెనూ చార్జీల కింద ప్రభుత్వం చెల్లించాలి. హాస్టల్ వార్డెన్లు ప్రతి నెలా డైట్ బిల్లులను సీఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. నెలకు సుమారు కోటిన్నర రూపాయలను ప్రభుత్వం విడుదల చేయాలి. అయితే గత ఏడాది నవంబరు నుంచి డైట్ బిల్లులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలకు సుమారు రూ.6 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని, సాంకేతిక సమస్యలను సాకుగా చూపుతూ బిల్లులు ... మిగతా 8వ పేజీలో

సరిగా అమలుకాని మెనూ



వసతిగృహాల్లో వుంటున్న విద్యార్థుల పోషకాహారం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా చేస్తున్నది. సంక్షేమ వసతి గృహాలకు డైట్ బిల్లులను నెలల తరబడి చెల్లించకపోవడంతో హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. వార్డెన్లను ప్రశ్నిస్తే... బిల్లులు రాకపోతే తామేం చేయగలమని బదులిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులకు నిధులను వెంటనే విడుదల చేయాలి, మెనూ సక్రమంగా అమలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

\- సుర్ల రమణ,
ఎస్ఎఫ్ఐ ప్రతినిధి, అనకాపల్లి జిల్లా

ప్రాణం తీసిన గతుకుల రోడ్డు

కేజేపురం జంక్షన్ వద్ద గోతులను తప్పించే క్రమంలో అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- వెనుక నుంచి వస్తున్న సిమెంట్ లారీ ఢీ
- ఎడమవైపునకు భర్తకు, కుడివైపునకు పడిపోయిన భార్య
- మీద నుంచి లారీ వెళ్లడంతో మహిళ అక్కడికక్కడే మృతి
- సొంతూరు ఎం.కోటపాడు
- గాజువాకలో బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం



సంఘటన స్థలం వద్ద అధ్వానంగా వున్న రోడ్డు, ప్రమాదానికి కారణమైన లారీ, వస్త్రం కప్పిన మృతదేహం

మాడుగుల రూరల్ (అనకాపల్లి జిల్లా), మార్చి 15 :



గోల్కొండ సత్యవతి (ఫైల్)

అధ్వానంగా వున్న రహదారుల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మరో నిండు ప్రాణాన్ని బలిగొన్నది. భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, రోడ్డుపైవున్న గోతులను తప్పించే క్రమంలో వెనుక నుంచి వస్తున్న సిమెంట్ లోడు లారీ బలంగా ఢీకొన్నది. దీంతో భర్త ఎడమ వైపునకు, భార్య కుడివైపునకు పడిపో యారు. ఈ క్రమంలో లారీ ఆమె మీదుగా దూసుకుపోయింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. మాడుగుల మండలం కేజేపురం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామానికి చెందిన గోల్కొండ ఈశ్వరరావు, సత్యవతి(45) ... మిగతా 8వ పేజీలో

ఎన్నికల యంత్రాంగం అప్రమత్తం

ఈవీఎంలు భద్రపరిచిన గోదామును పరిశీలించిన కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- సబ్బవరం మండలంలో హైవేపై చెకపోస్టును తనిఖీ చేసిన ఎస్పీ
- రోలుగుంట, 'పేట మండలాల్లో సాయుధ బలగాలు కవాతు



జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్/ సబ్బవరం/ నాతవరం/ రోలుగుంట, మార్చి 15:
సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల అవుతుందన్న సమాచారంతో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) భద్రపరిచిన గోదామును ఈ ఇద్దరు అధికారులు శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద అనకాపల్లి- ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు నర్సీపట్నం-తుని రోడ్డులో నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద పోలీసులు ... మిగతా 8వ పేజీలో



రోలుగుంటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

రోలుగుంట, 'పేట మండలాల్లో సాయుధ బలగాలు కవాతు

రోలుగుంట, పాయకరావుపేట మండలాల్లోని సమస్యాత్మక గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలు (సీఐఎస్ఎఫ్) కవాతు నిర్వహించాయి. రోలుగుంట మండలం రోలుగుంట, శరభవరం, బుచ్చెంపేట, కుసర్లపూడి గ్రామాల్లో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని కోరారు. పాయకరావుపేట మండలంలో గుంటపల్లి, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట, సత్యవరం, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, మాసాహెబ్‌పేట గ్రామాల్లో సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముదిరిన రంగుల పిచ్చి

విద్యుత్ స్తంభాలనూ వదలని వైసీపీ నాయకులు

- పార్టీ జెండా రంగులు, ఫ్యాన్ బొమ్మలు
- ఎన్నికల నిబంధనలకు విరుద్ధం
- అయినా పట్టించుకోని అధికారులు



కోట్ని వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మకు వేసిన వైసీపీ రంగులు, ఎన్నికల గుర్తు ఫ్యాన్

అనకాపల్లి టౌన్, మార్చి 15:
అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులకు రంగుల పిచ్చి మరింత ముదిరింది. గతంలో గ్రామ/ వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఆస్పత్రులు, తుఫాన్ షెల్టర్లు.. తదితర ప్రభుత్వ భవనాలకు వైసీపీ జెండా లోని మూడు రంగులు (నీలం, ఆకుపచ్చ, తెలుపు) వేశారు. కొన్నిచోట్ల శ్మశాన వాటికలను కూడా విడిచిపెట్టలేదు. దీనిపై న్యాయస్థానం మొట్టికాయలు వేయడంతో మళ్లీ ఆ రంగులు తుడిపేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ వైసీపీ నేతలు రంగుల ప్రచారాన్ని ఆపలేదు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసే సభల టెంట్‌లు, కుర్చీలు, వేదికపై అలంకరించే పూలు, బెలూన్లు కూడా వైసీపీ జెండా రంగులను పోలి వుంటున్నాయి. అధికారులు సైతం వైసీపీ మద్దతుదారులుగా వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సమీపిస్తుండడంతో వైసీపీ నేతలకు రంగుల పిచ్చి మరింత ముదిరింది. ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ పార్టీలకు సంబంధించి రాతలు, జెండాను పోలిన రంగులు, ఎన్నికల గుర్తులు రాయకూడదని నిబంధనలు వున్నాయి. కానీ కొంతమంది ... మిగతా 8వ పేజీలో

వలంటీర్లను వాడేస్తున్నారు!

వైసీపీ నేతలు ఇష్టారాజ్యం

- న్యాయస్థానం, ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు
- వలంటీర్ల ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరణ
- ఇందుకు ప్రతిఫలంగా 'నగదు తాంబూలం'
- 'పేట సమన్వయకర్త కార్యాయలంలో నజరానాలు పంపిణీ
- ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇచ్చినట్టు సమాచారం





కంబాల జోగులు (ఫైల్)

అనకాపల్లి, మార్చి 15:

గ్రామ/ వార్డు వలంటీర్లను ఎన్నికల విధులకు ఉపయోగించకూడదని హైకోర్టు, ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చాయి. కానీ వైసీపీ నేతలు అధికారంలో వున్నామన్న ధీమాతో ఎప్పటి మాదిరిగానే రాజ్యంగ బద్ధమైన సంస్థల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. అధికారికంగా కాకపోతే అనధికారికంగా వలంటీర్ల సేవలను వాడుకుంటామంటూ బరితెగిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు, వారికి తాయిలాలు అందించేందుకు వలంటీర్లను వాడుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు లేదా ఎమ్మెల్యేలు తొలుత మండలాల వారీగా వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు-తిమ్మాపురం కేంద్రంగా వున్న పాయకరావుపేట నియోజకవర్గం సమన్వకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు నివాసం వద్దకు గురువారం రాత్రి నక్కపల్లి మండలానికి చెందిన వలంటీర్లు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో 15 నుంచి 25 మంది వరకు గ్రామ వలంటీర్లు వున్నారు. వీరితోపాటు పార్టీ నాయకులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సమయంలో వైసీపీకి ఏ విధంగా సహకరించాలో దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు మీ చేతుల మీదుగానే డబ్బులు పంపిణీ చేయిస్తామని, ఇదే సమయంలో గ్రామాల్లో విపక్షాల నాయకులపై నిఘా వేయాలని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే జీతాలు పెరుగుతాయని, టీడీపీ ప్రభుత్వం వస్తే మీ ఉద్యోగాలు వుండవని అబద్ధాలు చెబుతున్నారు.

ఓటర్ల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరణ!

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో వలంటీర్ల పరిధిలో 50 కుటుంబాలు వున్నాయి. ప్రతి కుటుంబంలో ఎంత మంది ఓటర్లు వున్నారు? ఆ ఇంటిలో పెద్ద ఎవరు? బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ పే వున్న మొబైల్ నంబర్లు సేకరించి ఇవ్వాలని స్పష్టం చేశారు. తాము ఇచ్చే డబ్బులను మీ బ్యాంకు ఖాతాల్లో వేసుకుని, మీ మొబైల్ డిజిటల్ యాప్ ద్వారా ఓటర్ల ఖాతాకు జమ చేయాలని చెప్పారు. అలా వీలులేని పక్షంలో ఓటర్ల బ్యాంకు ఖాతాలు, మొబైల్ డిజిటల్ యాప్ వున్న ఫోన్ నంబర్ల వివరాలను తమకు అందజేస్తే.. పార్టీ నియమించిన ప్రత్యేక బృందాలు నగదు బదిలీ వ్యవహారాలను చక్కబెడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రతి వలంటీరుకు మొదటి విడత నజరానాగా రూ.5 వేల చొప్పున నగదు అందజేసినట్టు తెలిసింది. ముందు ముందు మీ 'సహకారం' బట్టి మరిన్ని నజరానాలు వుంటాయని ప్రకటించినట్టు సమాచారం.

18 నుంచి పది పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించాలి

- కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం
- రేపటిలోగా అన్ని కేంద్రాల్లో వసతులను తనిఖీ చేయాలి
- అధికారులకు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం
- జిల్లాలో 108 పరీక్షా కేంద్రాలు
- రెగ్యులర్ విద్యార్థులు 21,259, ప్రైవేటు విద్యార్థులు 2,324 మంది
- మాస్ కాపీయింగ్ నిరోధానికి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- అవసరమైన రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 15 (అనకాపల్లి): జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 21,259 మంది, ప్రైవేటు విద్యార్థులు 2,324 మంది హాజరు కానున్నట్టు చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 10,873 మంది, బాలికలు 10,386 మంది వున్నట్టు వెల్లడించారు. జిల్లాలోమొత్తం 108 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, రోజు విడిచి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, పరీక్ష సమయం పూర్తయిన తరువాతే బయటకు పంపుతామని ఆయన స్పష్టం చేశారు. నిర్ణీత సమయంకన్నా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా.. కేంద్రంలోకి అనుమతించేది లేదని చెప్పారు.

పదో తరగతి పరీక్షలను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని, అత్యంత అప్రమత్తంగా ఉండి ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను శని, ఆదివారాల్లో మరోసారి తనిఖీ చేయాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే చక్కదిద్దాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు పరీక్షల నిర్వహణ సిబ్బంది కూడా మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకెళ్ల కూడదని స్పష్టం చేశారు. డీఈఓ, చీఫ్ సూపరింటెండెంట్, ఇతర అధికారులకు సైతం ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. పరీక్షల్లో అక్రమాలు జరిగితే ఇందుకు బాధ్యులైన వారికి మూడేళ్లపాటు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, బీపీ, షుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని, రోజూ కేంద్రాలను తనిఖీ చేస్తాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు, పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా ఇతర వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా ఎంపిక చేసిన రూట్లలో ప్రత్యేక బస్సులు నడపాలని, హాల్ టికెట్ వున్న విద్యార్థులు ఉచితంగా ప్రయాణించేలా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ, డీఈవో ఎంవీ లక్ష్మమ్మ, డీఆర్‌ఓ దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు, చిన్నికృష్ణ, జయరామ్, డీఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్, రవాణా శాఖ ఇన్‌చార్జి కమిషనర్ ప్రకాశ్, జిల్లా పీటీడీ అధికారి సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.10
సహరి (ఆది)	4.51

నేడు విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభ

- 'సేవ్ విశాఖ-సేవ్ స్టీల్‌ప్లాంట్' నినాదంతో ఉక్కు తృష్ణా మైదానంలో నిర్వహణ
- హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):
సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జోరు పెంచుతోంది. కేడర్‌ను సమాయత్తం చేసే చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహిస్తోంది. ఈ మేరకు శనివారం విశాఖలో భారీ బహిరంగసభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు మాణిక్యం ఠాకూర్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతోపాటు సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం, మాజీ ఎంపీ కేవీ రామచంద్రరావు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. కాగా దీనికి 'న్యాయసాధన సభ' అని పేరు



స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో బహిరంగ సభకు ఏర్పాట్లు

పెట్టినట్టు నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సంబంధించి కాంగ్రెస్ డిక్లరేషన్‌ను సభలో ప్రకటించనున్నారు. కాగా ప్రత్యేక విమానంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర ముఖ్యనేతలు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి సాయంత్రం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, మార్చి 15: మార్టూరులో యువకుడు ఆత్మహత్యపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ వి. సత్యనారాయణ తెలిపారు. మార్టూరు గ్రామానికి చెందిన కర్రి రామకృష్ణ (32) ఫార్మాకంపెనీలో పనిచేస్తున్నాడన్నారు. అవివాహితుడైన రామకృష్ణ డ్యూటీకి సరిగా వెళ్లకపోవడంతో గురువారం మధ్యాహ్నం తండ్రి ఉమామహేశ్వరరావు మందలించాడన్నారు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చిన రామకృష్ణ తిరిగి ఇంటికి చేరలేదన్నారు. శుక్రవారం ఉదయం బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలోని ఏలేరు కాలువ గట్టు పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్న రామకృష్ణను తెలిసిన వారు చూసి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారన్నారు.వెంటనే కుటుంబసభ్యులు తుమ్మపాల పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు అన్న రామవేంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వెంకటఅప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రైలు కింద పడి యువకుడు...


శివగణేష్ (ఫైల్)

ఎస్.రాయవరం, మార్చి 15: మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో చందక శివ గణేష్ (18) శుక్రవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మారూఫ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్, గుల్లిపాడు రైల్వే స్టేషన్‌ల మధ్యలో శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై యువకుడు మృతి చెందినట్టు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్, సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్లి మృతుడిని పరిశీలించారు. మృతుడు గురించి వాకబు చేయగా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన చందక శివ గణేష్ (18)గా గుర్తించారు. శివ గణేష్ ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయం తల్లికి తెలియడంతో ఆమె మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శివ గణేష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. శివగణేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతం అయ్యారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వివాహిత...

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పరవాడ, మార్చి 15: ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గురువారం కలపాకలో చోటుచేసుకుంది. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలపాక గ్రామానికి చెందిన ఈతలపాక మూల వెంకటరావు, శ్యామల భార్యాభర్తలు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు పవన్ సాయి ఉన్నాడు. శ్యామల కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతుంది. భర్త వెంకటరావు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం భర్త డ్యూటీకి వెళ్లిపోగా కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. స్కూల్ నుంచి సాయంత్రం నాలుగు గంటలకు కుమారుడు పవన్‌సాయి ఇంటికి వచ్చేసరికి తల్లి బెడ్‌రూములో ఫ్యాన్ ఉక్కుకు వేలాడుతూ కనిపించింది. దీంతో భోరున ఏడవడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను కిందకు దించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహానికి ఎన్టీఆర్‌వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలి సోదరుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

» మైక్ సెట్ బిగిస్తుండగా ప్రమాదం

» కొండెంపూడి జగనన్న కాలనీ గృహ ప్రవేశం ఏర్పాట్లలో ఘటన


మృతి చెందిన సత్తిబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 15 : మైక్‌సెట్ బిగిస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. మండలంలోని కోమళ్లపూడికి చెందిన గేదెల సత్తిబాబు (39) మైక్ సెట్ ఓనర్. వివాహ శుభకార్యాలకు మైక్‌సెట్ అద్దెకు ఇస్తుంటాడు. శనివారం తెల్లవారుజామున కొండెంపూడిలోని జగనన్న కాలనీలో తమ గృహ ప్రవేశానికి మైక్‌సెట్ పెట్టాలని గ్రామానికి చెందిన ఆది శ్రీధర్ సత్తిబాబును కోరాడు. దీంతో శుక్రవారం రాత్రి మైక్ సెట్ బిగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. సత్తిబాబు మృతదేహాన్ని శ్రీధర్, మరో యువకుడు కొండెంపూడి నుంచి బైక్‌పై తీసుకొచ్చి కోమళ్లపూడి వాటర్ ట్యాంకు సమీపంలో పడేశారు. ఈ విషయాన్ని మృతుడి బంధువుకు గణేష్‌కు శ్రీధర్ ఫోన్ చేసి తెలిపాడు. సత్తిబాబు ప్రాణంతో ఉన్నాడని భావించిన గణేశ్ రావికమతం ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. వైద్యుడు పరీక్షించి అప్పటికే అతడు మృతిచెందినట్టు తెలిపారు. దీంతో సత్తిబాబు మృతదేహాన్ని బైక్‌పై ఆస్పత్రి నుంచి కొత్త కొండెంపూడికి తీసుకెళ్లి విద్యుత్ షాక్ గురై చనిపోయిన స్థలంలోనే గణేశ్, మృతుడి బంధువులు పడివేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మృతుడి బంధువులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

లంకెలపాలెం, మార్చి 15: పరవాడ మండలం పెదముషిడివాడలో శుక్రవారం ఒకరు అనుమారాస్పదంగా మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న ఎ. వెంకట ఆదిత్యశివ (46) నెల రోజుల క్రితం పెదముషిడివాడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఈయన ఒంటరిగా ఇంటిలో ఉంటున్నారు. ఈయన భార్య, తల్లిదండ్రులు గతంలో మృతి చెందారు. అయితే ఆదిత్యశివ ఇంట్లో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

» హత్యకు గురైన వ్యక్తి బాటిల్స్, కాగితాలు ఏరుకొనే దుర్గాప్రసాద్‌గా గుర్తింపు

ఎస్.రాయవరం, మార్చి 15: ఈనెల 2వ తేదీన మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో హైవే పక్కనే గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును ఎస్. రాయవరం పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురుని పట్టుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 2వ తేదీన అడ్డరోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నడుంపూడి గ్రామానికి చెందిన మటపాత్రుని దుర్గాప్రసాద్ (36)గా పోలీసులు గుర్తించారు. మృతుడు దుర్గాప్రసాద్ మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కాగితాలు, బాటిల్స్ ఏరుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే దుర్గాప్రసాద్‌కు అదే వృత్తిలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆ ముగ్గురు పథకం ప్రకారం ఈనెల ఒకటో తేదీ సాయంత్రం దుర్గాప్రసాద్‌కు ఎక్కువగా మద్యం తాగించారు. రాత్రికి కోనవానిపాలెం జంక్షన్‌కు సమీపంలో హైవే పక్కకు తీసుకొని వచ్చి దుర్గాప్రసాద్ కాళ్లు, చేతులు కట్టి కత్తితో పొడిచి చంపినట్టు దర్యాప్తులో తేలిందని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ అప్పన్న, ఎస్.రాయవరం, కోటవురట్ల ఎస్‌ఐలు, సిబ్బందిని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

ఉపమాక వెంకన్న ఉత్సవాలకు చకచకా ఏర్పాట్లు

» 19 నుంచి 25వ వరకూ వార్షిక కల్యాణోత్సవాలు


ఆలయం బయట భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకు షెడ్

నక్కపల్లి, మార్చి 15: ఉపమాకలో వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతీఏటా ఫాల్గుణశుద్ధ ఏకాదశి రోజున స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. గరుడాద్రి పర్వతం(కొండ)పైకి వెళ్లే మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం, ఇతర గోపురాలు, బేడా మండపం, ఆస్థాన మండపం, ఇతర కట్టడాలను రంగులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో గాలిగోపురం ఎదురుగా భక్తుల సౌకర్యార్థం ఎండ తీవ్రత లేకుండా తాత్కాలిక రేకు షెడ్డుఏర్పాటు చేశారు. ఈనెల 19న ఉత్సవాలకు అంకురార్పణ, 20న ధ్వజారోహణం, కల్యాణోత్సవం, రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. ఈ సంవత్సరంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనావేస్తున్నారు.

కింద ఆలయ దృశ్యం


20 రోజుల పాటు తీర్థం

స్వామివారి ఉత్సవాలు సందర్భంగా ఉపమాకలోనే 20 రోజులపాటు తీర్థం సాగుతుంది. పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అనేక దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఈ జాతరలో సుగంధ ద్రవ్యాల వ్యాపారం 20 రోజులపాటు రూ.కోట్లలో జరుగుతుంది. ఏడాది పాటు ఇంటిలో వండే వంటలకు సరిపడే విధంగా సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేస్తుంటారు. వీటితోపాటు తినుబండారాలు, ఇతర సరుకులను విక్రయించే దుకాణాలు ఏర్పడతాయి.

కాపు లేని జీడిమామిడి

» పెట్టుబడులు దక్కే పరిస్థితులు కానరాలేదని రైతులు ఆందోళన



నాతవరంలో ఇప్పటికీ పూతదశలో ఉన్న జీడిమామిడి తోటలు (ఇన్‌సెట్‌లో) తెగుళ్లు, పొగమంచు ప్రభావంతో మాడిపోతున్న జీడిమామిడి పిందెలు

నాతవరం, మార్చి 15: మండలంలో వరి తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో జీడిమామిడి తోటలు వున్నాయి. ఉద్యావన శాఖ అధికారుల గణాంకాల ప్రకారం సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే గత ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో జీడిమామిడి తోటల్లో పూత ఆలస్యంగా వచ్చింది. సాధారణంగా ఏటా ప్రస్తుత సమయానికి తోటల్లో పిందెలు కనిపించేవి. కానీ ఈ ఏడాది నాలుగింట మూడొంతుల తోటలు ఇంకా పూత దశలోనే వున్నాయి. గత నెలలో పూత వచ్చే సమయంలో పొగమంచు దట్టంగా కురవడంతో చాలా వరకు పూత మాడిపోయింది. మరోవైపు తెగుళ్ల దాడి చేయడంతో వీటి నియంత్రణ కోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. అయినా సరే చాలా వరకు పూత రాలిపోయింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి అయ్యిందని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు రెండు బస్తాలకు (ఒక్కో బస్తా 80 కిలోలు) మించి జీడిపిక్కల దిగుబడి వచ్చే అవకాశం లేదని అంటున్నారు. 2020లో బస్తా జీడిపిక్కలు రూ.12 వేలు పలికిందని, గత ఏడాది రూ.7 వేలకు పడిపోయిందని, ఈ ఏడాది ఇదే ధర వుంటే పెట్టుబడి కూడా చేతికి రాదని రైతులు వాపోతున్నారు.

ట్రయల్ కోర్టులో వాదనలే లా విద్యార్థులకు కీలకం

» హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు

సబ్బవరం, మార్చి 15: న్యాయ విద్యార్థులకు ట్రయల్ కోర్టులో వాదనలే కీలకమని, ట్రయల్ కోర్టులో ప్రాక్టీస్ వలన ఫైలింగ్ దగ్గర నుంచి పూర్తయ్యేంతవరకూ వివిధ దశలపై అవగాహన ఏర్పడుతుందని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు పేర్కొన్నారు. మండలంలోని అసకపల్లి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం వర్సిటీకి చెందిన ప్రో బోనో క్లబ్, లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో 'ది ట్రయల్ అడ్వకసీ'పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ.. ట్రయల్ కోర్టులో అనుభవం వలన న్యాయవాద వృత్తిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి దశలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎలా డిపెండ్ చేసుకోవాలో నేర్చుకోవచ్చునన్నారు. ట్రయల్ కోర్టు ప్రాక్టీసు తరువాత మాత్రమే హైకోర్టులకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. కేసుకు సంబంధించిన ఆధారాల సేకరణలో జాగ్రత్త ఎంతో అవసరమన్నారు. వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు అవదేశ్ నారాయణ్ సింఫీ, శ్రీప్రసన్న స్వామినాథన్, శ్రీ శరత్‌చంద్ర, ప్రశాంత్‌కుమార్, న్యాయవాదులు, కో-కన్వీనర్లు, కమిటీ సభ్యులు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ నందిని సీపీ, పీటీసీ చైర్‌పర్సన్ టీఏస్ సునీత, డాక్టర్ సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అవకాశమిస్తే రాష్ట్రం రావణకాష్టమే

» టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ


వేదికపై గాజు గ్లాసు గుర్తును చూపిస్తున్న నాయకులు

తుమ్మపాల, మార్చి 15 : వైసీపీకి మరోసారి అవకాశమిస్తే రాష్ట్రం రావణకాష్టంలా మారడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి తుమ్మపాలలో జరిగిన మూడు పార్టీల నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం నుంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. అమరావతి రైతులతో పాటు రాష్ట్ర రైతాంగాన్ని మోసగించిన ఏకైక వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. రైతుల శాపం జగన్మోహన్‌రెడ్డి తగలడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీతోనే సుభిక్ష పాలన సాగుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు పునర్నిర్మాణం కోసమే జనసేన పావులు కదుపుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు నాయకులంతా కృషి చేయాలన్నారు.

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసిన ఘనుడు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని అన్నారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే మూసేసిన ఘనుడు మంత్రి గుడివాడ అని అన్నారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, పచ్చికూర రాము, నారపిన్ని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 26 మంది జేఎల్స్‌కు ఉద్యోగోన్నతి

విశాఖపట్నం, మార్చి 15 : ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 26 మంది లెక్చరర్లు ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. విశాఖ జిల్లాలో 15 మందికి ఈ అవకాశం లభించగా అనకాపల్లి నుంచి 9, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇద్దరు పదోన్నతి పొందారు. విశాఖ జిల్లాలో డాక్టర్ వీఎస్ కృష్ణ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఎస్.నాగమణిని కె.కోటపాడు, అన్నపూర్ణను వడ్డాది, పి. మంజులను రోలుగుంట, ఎం.విజయకుమార్‌ను సోంపేట కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా బదిలీ చేశారు. మహిళా జూనియర్ కళాశాల లెక్చరర్లు కె. శ్రీదేవిని నక్కపల్లి, బీవీ పద్మావతిని నర్సీపట్నం, ఏఆర్‌టీ సుజాతను కోటవురట్ల కళాశాలకు, పెందుర్తి కళాశాల లెక్చరర్లు పి. ఆనంద్‌కుమార్‌కు కోటబొమ్మాళి, పి. అరుణకుమారిని అరుకువేలి, కె. శ్రీహరికి కేడీపేట, పి. యతేంద్రనాథ్‌కు కొత్తూరు, యూవీఎస్ వర్మకు తోగరం, ఎండీ లలితకుమారిని పెందుర్తి కళాశాలకు బదిలీ చేశారు. కృష్ణ ఒకేషనల్ కళాశాల లెక్చరర్లు ఆర్‌జీ మహేశ్వరరావుకు బారువ, వి. శంకరరావుకు ఇచ్ఛాపురం కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా నియమించారు. అనకాపల్లి జిల్లాలోని చోడవరం కళాశాల లెక్చరర్లు ఎం. భరతశ్రీకు మాకవరం, మాడుగుల కళాశాల లెక్చరర్ ఎస్. శ్రీనివాసరావును పాడేరు, మాకవరపాలెం కళాశాల లెక్చరర్ కె. గోవిందరావును చింతపల్లి, పరవాడ కళాశాల లెక్చరర్లు ఎ. శోభను నర్సీపట్నం, వి. సుశీల్‌కుమార్‌ను సారవకోట, ఎంవీ స్వామినాయుడును డుంబ్రిగుడ బదిలీ చేశారు. దేవరపల్లి లెక్చరర్ జె. వివేకనందరావును కవిటి, సబ్బవరం లెక్చరర్ ఎల్. సత్యవతిని కొత్తకోట, యలమంచిలి లెక్చరర్ వి. పద్మజను యలమంచిలి బదిలీ చేశారు. అలాగే అల్లూరి జిల్లాలోని ముంచంగుపుట్టు కళాశాల లెక్చరర్ కె. కొండన్నదొరను అదే కళాశాల ప్రిన్సిపాల్‌గా, అనంతగిరి లెక్చరర్ కె. ప్రమీలను కూడా అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. హుకుంపేట కళాశాలకు సీహెచ్ రాంబాబు (కొత్తవలస), జి.మాడుగుల కళాశాలకు ఎ.గౌరీప్రసాద్ (డెంకాడ) ప్రిన్సిపాళ్లుగా పదోన్నతిపై వచ్చారు.

19లోగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ తరలింపు

» రికార్డుల పరిశీలనకు అనుమతించండి

» ఆర్టీఐ ఎస్‌సీఐసీ ఆర్.మహబూబ్ బాషా ఆదేశాలు

అనకాపల్లి టౌన్, మార్చి 15: అనకాపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు రికార్డుల పరిశీలనకు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తుదారుల్ని అనుమతించాలంటూ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సీఐసీ) ఆర్.మహబూబ్ భాష ఆదేశించారని ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు దాటవేత ధోరణితో పొంతన లేని సమాధానాలివ్వడం పట్ల శుక్రవారం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు ఫైళ్ల పరిశీలన విషయమై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన కేసు వర్చువల్ విధానంలో ఆయన విచారించారని తెలిపారు. దరఖాస్తుదారు కోరిన రికార్డులను తక్షణం 19లోగా పరిశీలనకు అనుమతించాలని ఆదేశించారన్నారు. విచారణలో తనతోపాటు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్. జానకీదేవి, సబ్‌రిజిస్ట్రార్ ఎస్. బసవేశ్వరరావు పాల్గొన్నారన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట, మార్చి 15 : మండలంలో శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 3 వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసి, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పాయకరావుపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఈబీ జిల్లా అధికారులకు అందిన పక్కా సమాచారంతో శుక్రవారం అనకాపల్లి ఏఈఎస్ డి. శైలజరాణి, డీటీఎస్ ఇన్‌స్పెక్టర్ షేక్ మీరాసాహెబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతపేటలో దాడి చేసి పది లీటర్ల సారాతో ఒకరిని అరెస్టు చేశామన్నారు. అలాగే అరట్లకోట గ్రామ సమీపంలో మరో వ్యక్తి వద్ద 20 లీటర్ల సారాతో అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా పట్టణ శివారు ధారకొండ ప్రాంతంలో సారా తయారీకి నిల్వ ఉంచిన 3వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ స్టేషన్ ఎస్‌ఐ పి.జాన్‌ప్రసాద్, అనకాపల్లి డీటీఎఫ్ ఎస్‌ఐ పి.శాంతిలక్ష్మి, ఎలమంచిలి ఎస్‌ఈబీ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారని సీఐ తెలిపారు.


చంద్రబాబు సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రావికమతంలో చంద్రబాబు ఎన్నికల సభ

» 22 నుంచి 25వ తేదీల మధ్య ఉండవచ్చు

» స్థల పరిశీలన జరిపిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, మార్చి 15 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం ఎన్నికల సభను రావికమతంలో నిర్వహించనున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ ఈ నెల 22 నుంచి 25వ తేదీ మధ్య ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి సభా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావికమతం- గర్నికం మధ్యనున్న లేఅవుట్‌లోని ఖాళీ స్థలంలో సభ నిర్వహిస్తే ఎలా ఉంటుందోనన్న ఆలోచన చేస్తున్నామన్నారు. సభ వలన ట్రాఫిక్‌కు, వచ్చి పోయేవారికి ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో స్థల పరిశీలన జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదు నాయుడు, మురుపాక ఎంపీటీసీ ముత్యా సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరరావు, గోకివాడ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీకి పరుచూరి భాస్కరరావు రాజీనామా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరుచూరి భాస్కరరావు

కొత్తూరు, మార్చి 15: జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కొద్ది రోజులుగా విజయవాడలో ఉండి ప్రయత్నించినప్పటికీ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అపాయింట్‌మెంట్ దొరకలేదనే బాధతో ఆ పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు సీటు కేటాయించినప్పటికీ పార్టీకి సేవ చేద్దామమని అనుకున్నానన్నారు. తాను ఏ పార్టీలోనూ చేరనని, రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని ప్రకటించారు. అభిమానులు, కార్యకర్తలు ఎవరి నిర్ణయం వారే తీసుకోవచ్చన్నారు. తన రాజీనామా లేఖను ప్రదర్శించి పార్టీ అధినేతకు పంపించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

» రక్షణ కల్పించాలని నర్సీపట్నం సీఐకు వినతి

» వివాహం చేసుకున్నందుకు తమపై దాడి చేశారని ఆరోపణ


పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రేమ జంట

నర్సీపట్నం, మార్చి 15 : ప్రేమ వివాహం చేసుకున్న తమకు రక్షణ కల్పించాల్సిందిగా కీర్తిక, చంద్రశేఖర్ జంట నర్సీపట్టణ సీఐ కాంతికుమార్‌ను శుక్రవారం కోరారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన పూసపాటి చంద్రశేఖర్ (24), ఎన్ఏడీ కాకాని నగర్‌కు చెందిన కె.నిధి కీర్తిక (22) గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. పెద్దలకు చెప్పకుండా ఫిబ్రవరి 14న తిరుపతిలో వివాహం చేసుకున్నారు. వేర్వేరు కులాలు కావడంతో కీర్తిక తండ్రి వీరి ప్రేమ వివాహాన్ని అంగీకరించ లేదు. దీంతో చంద్రశేఖర్‌పై కిడ్నాపింగ్ కేసు పెట్టారు. ఇద్దరూ మేజర్లు కావడంతో పెళ్లి చేసుకున్నట్టు అధికారికంగా మేరేజ్ సర్టిఫికెట్ ఉండాలని కొంత మంది చెప్పడంతో ఈనెల 13వ తేదీన సింహాచలంలో మరోసారి వివాహం చేసుకున్నారు. ఇదిలావుంటే, గురువారం విశాఖపట్నంలో కొంత మంది దాడి చేసి కొట్టారని ఆ ఫిర్యాదులో వారు ఆరోపించారు. వారి నుంచి తప్పించుకొని నర్సీపట్నం శారదానగర్‌లోని ఒక లాడ్జీలో దిగామని, రాత్రి అక్కడికి కూడా వారు వచ్చి కొట్టారని బాధితులు విలేకరుల వద్ద వాపోయారు. శుక్రవారం ఉదయం పట్టణ సీఐ కాంతికుమార్‌ను కలిసి తన తండ్రి బారినుంచి తమకు రక్షణ కల్పించాలని యువతి కోరింది. దీనిపై సీఐని వివరణ కోరగా, యువతీ యువకులు ఇద్దరూ మేజర్లే అని తెలిపారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామంటే పంపించామని వివరించారు.

అటవీ శాఖ డీఆర్‌వోకు పదోన్నతిపై బదిలీ


కేవీ రాజేశ్

కృష్ణాదేవిపేట, మార్చి 15: గొలుగొండ, కొయ్యూరు మండలాల పరిధిలో గల కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ రాజేశ్‌కు పదోన్నతిపై అల్లూరి జిల్లా పెదబయలు రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం ఆయనకు అందాయి. ఏడాదిన్నరగా రాజేశ్ ఇక్కడ సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారు. రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన ఆయనను కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు నాయకులు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 15: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది ఏ విద్యార్థి కూడా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా విద్యాశాఖ అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవడంతో ఏ ఒక్క విద్యార్థి డిబార్ కాలేదు. జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షకు 11,660 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 12,122 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 462 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ఆమె తెలిపారు.

పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, మార్చి 15: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది ఉద్యోగులు వారి సమస్యలను ఎస్పీ కేవీ మురళీకృష్ణకు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు.

20 నుంచి శ్రీవారి కల్యాణోత్సవాలు

అనకాపల్లి టౌన్, మార్చి 15 : స్థానిక దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుంచి శ్రీవారి కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి, ఈవో టి.రాజసులోచన ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీన ధ్వజారోహణం, సాయంత్రం ఎదురు సన్నాహం కార్యక్రమం, రాత్రి ఎనిమిదిన్నర గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అలాగే 21న శ్రీవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

23 దేవాలయాలకు రూ.2.3 కోట్లు మంజూరు

కోటవురట్ల, మార్చి 15: మండలంలో 23 ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం రూ.2.3 కోట్లు మంజూరు చేసిందని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతబాబు (దత్తుడు) తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 23 ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో హిందూ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఒక్కొక్క ఆలయానికి రూ.పది లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పెట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి నూతన ఎక్స్‌కవేటర్



ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీస్తున్న దృశ్యం

ఎలమంచిలి, మార్చి 15: మునిసిపాలిటీలో శుక్రవారం చైర్‌పర్సన్ రమాకుమారి, వైస్ చైర్మన్లు నూతన ఎక్స్‌కవేటర్‌ను ప్రారంభించారు. ఇటీవల సెజ్‌లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన ఎక్స్‌కవేటర్‌ను చైర్‌పర్సన్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆంజేయస్వామి ఆలయం వద్ద నుంచి సెయింట్ జూడ్స్ స్కూలు వరకూ యానాద్రి కాలువలో పూడికను తీయించారు. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, డీఈఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడి అందరి బాధ్యత

ఎలమంచిలి, మార్చి 15: బాల్య వివాహాలు నిర్మూలన బాధ్యత అందరిపైన ఉందని జడ్పీటీసీ సభ్యుడు శానాపతి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఏటికొప్పాకలో బాల్య వివాహాలు, యుక్త వయస్సులో వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో అనారోగ్య కారణాలు ఎదురవ్వడంతో పాటు తీవ్ర ఇబ్బందులకు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో నేతలు శాణాపతి రాము, దేవరపల్లి రమణ, ఎస్.సత్యనారాయణ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

సెక్టార్, రూట్ ఆఫీసర్లతో ఈఆర్వో సమావేశం

నక్కపల్లి, మార్చి 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సెక్టార్, రూట్ ఆఫీసర్లతో ఈఆర్వో గీతాంజలి సమావేశమయ్యారు. రూట్ ఆఫీసర్లు, సెక్టారు ఆఫీసర్లు అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఏ నిమిషంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్, కోడ్ అమలులోకి రావచ్చునన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయపార్టీల బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

ఎలమంచిలి, మార్చి 15: పట్టణంలోని వీరభద్రస్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల పునర్నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించామని కొక్కిరాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల కొండబాబు తెలిపారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, చైర్‌పర్సన్ రమాకుమారి ఈ నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కె. లక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు పంటల ధ్రువపత్రాలు పంపిణీ

ఎలమంచిలి, మార్చి 16: మండలంలోని లైనుకొత్తూరులో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు రైతులకు పంటల ధ్రువ పత్రాలు పంపిణీ చేసినట్టు ఏవో కె.మోహనరావు తెలిపారు. రబీలో మండలంలో 1,306 మంది రైతులకు పంట నమోదు పత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు వసంత కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో సమావేశం

ఎలమంచిలి, మార్చి 15: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని ఎలమంచిలి నియోజకవర్గ ఈఆర్ఓ మనోరమ అధికారులకు సూచించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఎన్నికల అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అప్పలరాజు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

సబ్బవరం, మార్చి15: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పేర్కొన్నారు. మండల పరిషత్తు ఆవరణలో శుక్రవారం మహిళలకు వైఎస్ఆర్ చేయూత 4వ విడత చెక్కును ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, మాజీ ఎంపీపీ ముత్యాలనాయుడు, నేతలు కర్రి బాబు, సురేశ్‌రాజ్, బోకం రామునాయుడు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి రూ. 3 లక్షలు విరాళం

సబ్బవరం, మార్చి 15: మండలంలోని రాయపుర అగ్రహారంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేశ్‌రాజ్ శుక్రవారం రూ. 3 లక్షలు విరాళాన్ని సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్‌రాజ్‌కు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నెక్కిళ్ల అచ్చిబాబు, బుద్దల పరదేశి, గూడపు లోవ, నందారు రాము, వంకర రమణ, బందం శ్రీను, నరసింగరావు, అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి రూరల్, మార్చి 15 : కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రీ మెటిక్ స్కాలర్‌షిప్‌లకు మాన్యువల్ స్కావెంజర్స్, చర్మకారులు, ఫ్లేయర్స్ , వ్యర్థాలను సేకరించేవారు, ప్రమాదకర శుభ్రత వృత్తిలో పని చేస్తున్న వారు అర్హులని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి టి. అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలచే గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డే స్కాలర్స్ అయితే మూడు వేల రూపాయలు మంజూరవుతుందన్నారు. హాస్టలర్స్ అయితే ఎనిమిది వేల రూపాయలు స్కాలర్‌షిప్ మంజూరవుతుందని చెప్పారు. అర్హులైన వారంతా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తును ఏప్రిల్ 10వ తేదీలోగా చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా సోమేశ్వరరావు



ఎలమంచిలి, మార్చి 15: ఎలమంచిలి తాలూకా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.సోమేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరులో గురువారం నిర్వహించిన రాష్ట్ర మహా జనసభలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అనకాపల్లి జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు తెలిపారు. సోమేశ్వరరావు ఎలమంచిలి పెన్షనర్స్ అసోసియేషన్‌కు గత 20 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సోమేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు నివేదిక బహిర్గతం చేయాలి

» **టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల డిమాండ్**



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తూరు, మార్చి 15 : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు నివేదిక బట్టబయలు చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అనకాపల్లి బెల్లం మార్కెట్ యార్డులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద వివేకానంద రెడ్డి చిత్రపటానికి అనకాపల్లి జనసేన-టీడీపీ-బీజేపీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్ల కార్డులతో నినాదాలు చేశారు. వివేకానంద రెడ్డి హత్యకు గురై నేటికీ ఐదేళ్లు పూర్తయినప్పటికీ కేసు ఇంకా విచారణ దశలోనే ఎందుకు ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాబాయ్ హత్యలో అబ్బాయి పాత్ర ఎంత ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, కాయల మురళీ, నైనంశెట్టి రమణరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, షేక్ బాబర్, పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

» **ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్**

అనకాపల్లి టౌన్, మార్చి 15 : గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వి. శంకర్ నాయక్ చెప్పారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు రోజుల పర్యటించానని, ఈ సందర్భంగా పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. ముఖ్యంగా నాన్ షెడ్యూల్ పరిధిలోని గ్రామాలను ఐటీడీఏ పరిధిలోకి తీసుకు రావాలని నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తానన్నారు. 40 మండలాల్లో 597 గ్రామాలు నాన్‌షెడ్యూల్‌లో ఉందన్నారు. అలాగే నాన్‌షెడ్యూల్ గ్రామాల గిరిజనులకు విశాఖ కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాడుగుల, వడ్డాది తదితర గ్రామాల్లో ఎస్టీ వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో ఉన్నాయని, వాటి స్థానంలో శాశ్వత భవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి శ్మశానవాటిక ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంకర్‌నాయక్

ఎస్పీని కలిసిన శంకర్‌నాయక్

అనకాపల్లి రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వి. శంకర్‌నాయక్ శుక్రవారం కలిశారు. పలు గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి, అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఎస్పీ కేవీ మురళీకృష్ణకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు దొర పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన..

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిను కలిశారు. గత రెండు రోజులుగా శంకర్‌నాయక్ జిల్లాలో పర్యటించి అనేక సమస్యలను గుర్తించగా.. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి నాగశిరీష పాల్గొన్నారు.

జగన్ బీసీ ద్రోహిగా మిగిలిపోతారు

» **టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అనిత**



రామన్నపాలెంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి అనిత

కోటవురట్ల, మార్చి 15: రాష్ట్రంలో బీసీలను అన్ని విధాలుగా అణగదొక్కిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని పాయకరావుపేట టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఆక్సాహెబ్‌పేట, చినబొడ్డేపల్లి, వీకేపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో ఆమె ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీ కులాల ఆర్థిక అభివృద్ధికి పథకాలు అమలు చేసిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి ఆ కుటుంబాలకు తీరని నష్టం కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం : ప్రగడ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మార్చి 15: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడమే ధ్యేయంగా టీడీపీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. పూడిమడక రోడ్డులోని కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన టీడీపీ ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతలు ఫోన్లు చేసి మాకు సహకరించమని కోరుతున్నారని, అలాంటి తప్పు ఎవరూ చేయవద్దన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే స్థానిక సంస్థల్లో తాము పట్టు సాధించవచ్చునన్నారు. తనకు సీటు వచ్చినా, రాకపోయినా అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒకసారి పునరాలోచించి ఈసీటును టీడీపీ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడు బాబు, నాయకులు దూళి రంగనాయకులు, దిన్‌బాబు, ఆడారి మంజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కొత్తూరు, మార్చి 15 : పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీలో పారిశుధ్య పనులకు శుక్రవారం టెండర్ నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి పేపర్‌లో ప్రకటన ఇచ్చి, కార్మికులు టెండర్ వేసుకోవడానికి వస్తే అధికార పార్టీ నేతలతో లాలూచీ పడి సెలవుపెట్టి వెళ్లిపోయారని ఆరోపించారు. సర్పంచ్ ద్వారా టెండర్ వాయిదా వేసినట్టు నోటీసు బోర్డుపై కాగితం అంటించి విధులకు డుమ్మా కొట్టడం దుర్మార్గమన్నారు. చెవ్వేటి నేస్తాలు, కలిగొట్ల నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుమారుడికి పూర్వ విద్యార్థులు చేయూత

కశింకోట, మార్చి 15 : మండలంలోని జట్టపురెడ్డి తుని పంచాయతీ నర్సింగబిల్లి గ్రామానికి చెందిన మారిశెట్టి భారతి కుమారుడు ప్రసాద్‌ను 2007-2008 పూర్వ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. ఇందుకుగాను తామంతా ముందుకు వచ్చి 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివించేందుకు శ్రీనిజ స్కూలు యాజమాన్యానికి రూ.20వేలు ఫీజు చెల్లించారు. భవిష్యత్తులో ప్రసాద్‌కు తామంతా ఉన్నామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఉన్నతమైన చదువునకు తామంతా చేయూత అందిస్తామని ప్రకటించారు.

గ్లాసులతో టీ పంపిణీ చేసిన జనసైనికులు

కొత్తూరు, మార్చి 15 : పట్టణంలోని నెహ్రూచౌక్ కూడలిలో శుక్రవారం జనసైనికులు గాజు గ్లాసులతో టీ పంపిణీ చేశారు. మన గుర్తు గాజుగ్లాసుకే అంటూ నినాదాలు చేశారు. రానున్న రోజుల్లో జనసేన, టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలని జనసైనికులు కోరారు. ఈ కార్యక్రమంలో దూలం గోపి, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, భర్నికాన రాము, కేఎస్‌వీ సత్యనారాయణ, కిషోర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల యంత్రాంగం అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కేంద్ర సాయుధ బలగాలు (సీఐఎస్ఎఫ్) శుక్రవారం రేలుగుంట, పాయకరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

గోదాములో ఈవీఎంల పరిశీలన

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) చాలా రోజుల క్రితమే జిల్లాకు చేరాయి. వీటిని అనకాపల్లి మండలం శంకరం పరిధి జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో గోదాములో భద్రపరిచారు. వీటిని శుక్రవారం కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. గోదాముకు వేసిన సీల్, సీసీ టీవీ పుటేజీలను పరిశీలించారు. అనంతరం ఈవీఎంల గోదాము పక్కన ఉన్న ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన భవనం మొదటి, రెండు అంతస్తుల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. వీరి వెంట ఏఎస్పీ విజయభాస్కర్, డీఆర్‌వో దయానిధి, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రామ్మూర్తి వున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఆర్.ధనుంజయ్, సిబ్బంది ఉన్నారు. కాగా ఎన్నికల నేపథ్యంలో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 350 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. అనుమానితులు, రౌడీలుగా గుర్తించిన 65 మందితోపాటు టీడీపీకి చెందిన 100 మంది, వైసీపీకి చెందిన 100 మంది, జనసేనకు చెందిన 35 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని చెప్పారు.

తుని-నర్సీపట్నం రోడ్డులో వాహనాలు తనిఖీ

నాతవరం పోలీసులు తుని-నర్సీపట్నం రోడ్డులో గన్నవరంమెట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనం నంబరును డైరీలో నమోదు చేస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్ల కూడదని, ఒకవేళ అధిక మొత్తంలో డబ్బు తీసుకెళుతూ పట్టుబడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరైన ఆధారాలు ఉంటే నగదును తిరిగి ఇచ్చేస్తామని, లేకపోతే నగదును సీజ్ చేసి ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామని ఏఎస్ఐ బంగార్రాజు తెలిపారు.

ప్రాణం తీసిన గతుకుల రోడ్డు

... 5వ పేజీ తరువాయి

దంపతులు. ఈశ్వరరావు కుల వృత్తిపై (బార్బర్ షాపు) ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం విశాఖ నగరంలోని గాజువాక ప్రాంతంలో బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరుకావడానికి భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఎం.కోటపాడు బయలుదేరారు. సుమారు ఏడున్నర గంటల సమయానికి వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో కేజేపురం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ రహదారి మొత్తం గోతులు ఏర్పడి పూర్తిగా ఛిద్రమైంది. గోతులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఇదే సమయంలో ఎలమంచిలి ప్రాంతంలోని ఒక కంపెనీ నుంచి సిమెంట్ లోడుతో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టుకు వెళుతున్న లారీ ఢీకొన్నది. దీంతో వాహనం నడుపుతున్న ఈశ్వరరావు ఎడమవైపునకు పడిపోగా, వెనకు కూర్చున్న సత్యవతి కుడివైపును పడిపోయింది. క్షణాల్లో లారీ ఆమె మీద నుంచి వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. ఈశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మృతురాలి కుమారుడు శివశంకర్ (గ్రామ వలంటీరు) ఇక్కడకు వచ్చి కన్నీరుమున్నీరు అయ్యాడు. ఎస్ఐ దామోదరనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ జోకల సింహాచలంనాయుడుని అదుపులో తీసుకున్నారు. శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఎం.కోటపాడు గ్రామం వుందని, ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారని, ఇంతలోనే సిమెంట్ లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆమెను కబళించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగుండి వుండే ఈ ప్రమాదం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు.

హాస్టళ్లలో ఆకలి కేకలు

... 5వ పేజీ తరువాయి

చెల్లించడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. గతంలో ఒకటి, రెండు నెలలు ఆలస్యంగా బిల్లులు వచ్చేవని, కానీ కొంతకాలం నుంచి నాలుగు నెలలకు తక్కువ కాకుండా బిల్లులు పెండింగ్‌లో వుంటున్నాయని చెబుతున్నారు. దుకాణాల్లో అరువుపై సరకులు తెచ్చి, విద్యార్థులకు భోజనాలు వండి పెడుతు న్నామని, బకాయిలు పేరుకుపోవడంతో వ్యాపారులు కూడా అరువుపై సరకులు ఇవ్వడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని అంటున్నారని, కోడ్ అమల్లోకి వస్తే పెండింగ్ బిల్లుల చెల్లింపు జరగడం అనుమానమేనని అంటున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడేందుకు రెండు నెలలకుపైగా సమయం పడుతుందని, అంతవరకు బిల్లులు రాకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. కాగా వసతిగృహాలకు మెస్ బిల్లుల బకాయిల విషయాన్ని జిల్లా ఎస్సీ సాధికార అధికారి అజేయ్‌బాబు, బీసీ సాధికార అధికారి రాజేశ్వరి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా.. డైట్ బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు.

ముదిరిన రంగుల పిచ్చి

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా పార్టీ రంగులు, ఎన్నికల గుర్తులు వేయిస్తున్నారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధి కోట్నివీధిలో విద్యుత్ స్తంభాలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలకు వైసీపీ రంగులు పులిమారు. వీటిని చూసిన స్థానికులు.. విద్యుత్ స్తంభాలను కూడా వదలరా? అంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు ప్రభుత్వ ఆస్తులను కూడా ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. అధికారం చేతిలో వుందన్న పొగరు, తాము ఏం చేసినా అధికారులు అడ్డుచెప్పరన్న ధీమాతోనే అధికార పార్టీ నేతలు ఇలా రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగావిద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మలపై వైసీపీ రంగులు, ఎన్నికల గుర్తులు వేయడంపై ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా... గుర్తు తెలియని వ్యక్తులు వైసీపీ రంగులు వేసినట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని చెప్పారు.

నేడు విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభ

... 5వ పేజీ తరువాయి

నాలుగు గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు సుమారు 70 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని పార్టీ నేతలు, ఇన్‌చార్జులకు బాధ్యతలను అప్పగించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం రెండు వేల మందిని తీసుకురావాలని నిర్దేశించారు. కాగా సభా ఏర్పాట్లను శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జపర్తి శ్రీనివాసరావు, ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేగి వెంకటేశ్, స్టేట్ యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు, విశాఖ నగర పార్టీ అధ్యక్షుడు గోవింద్, అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పరిశీలించారు.

'సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం'



అమలాపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, మార్చి 15: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరమని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. మండలంలోని అమలాపురం, పాటిమీద గ్రామాల్లో శుక్రవారం టీడీపీ ఎన్నికల శంఖారావంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలను కలిసి ఈ పథకాల గురించి వివరించారు. ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని, ఉమ్మడి అభ్యర్థిని అనితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, అప్పలరాజు, శంకరరావు, గబ్బర్ సింగ్, గోవింద్, వై.అప్పలరాజు, సత్తిబాబు, వంకా రమణ పాల్గొన్నారు.

నేడు సత్యవరంలో గౌరీ శంకరుల జాతర

పాయకరావుపేట రూరల్, మార్చి15: మండలంలోని సత్యవరంలో శనివారం గౌరీ శంకరుల జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ జాతరకు లక్షలా మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని నిర్వాహకులు అంచనా వేశారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

పరవాడ, మార్చి 15 : క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యానికి మేలు చేస్తుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు అన్నారు. తానాం పరదేశిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా శుక్రవారం మండలస్థాయి క్రికెట్ పోటీలను సర్పంచ్ కన్నూరిదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 30 జట్లకు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరి వెంకటరమణ, స్థానిక నాయకులు గొరుపుటి సతీష్, పైలా జానకిరావు, వర్రి వెంకటరమణ రొంగలి అప్పారావు పాల్గొన్నారు.

రాంకీ పైపులైన్ పనులను నిలుపుదల చేయాలి

పరవాడ, మార్చి 15 : రాంకీ యాజమాన్యం తాడిలో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమితోపాటు గ్రీన్‌బెల్ట్ ఏరియాలో గల చెట్లను తొలగించి రాంకీ యాజమాన్యం అడ్డగోలుగా పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతుందని మండిపడ్డారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దొంగచాటుగా పనులు చేపడుతున్న రాంకీ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దిమిలిలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి, మార్చి 15 : మండలంలోని దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి పర్యవేక్షకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేష్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి బాలశ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సింబయో' బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రాంబిల్లి, మార్చి 15: ఎస్ఈజడ్‌లోని సింబయో జనరిక్స్ ఫార్మా కంపెనీలో ప్రమాదానికి గురైన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని శుక్రవారం కంపెనీ వద్ద సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, జి.దేముడునాయుడు మాట్లాడుతూ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులు ఎ.రాము, సన్యాసిరావు, నరసింగరావులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు చందక రామకృష్ణ, వై.రాము, నాయుడు, నరసింగరావు, రాంబాబు, శివాజీ తదితరులు ఉన్నారు.

పెదకలవలాపల్లిలో అభివృద్ధి పనులు

రాంబిల్లి, మార్చి 15 : మండలంలోని పెదకలవలాపల్లి ఎస్సీ, హైటెక్ కాలనీల్లో రూ.6.5లక్షల మండల పరిషత్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు సర్పంచ్ యలమంచిలి కనకారావు తెలిపారు. మాజీ సర్పంచ్ పి.తాతబాబు, వైస్ ప్రెసిడెంట్ గణేష్‌లతో కలిసి శుక్రవారం పనులను పరిశీలించారు. ఎస్సీకాలనీకి చెందిన శ్మశాన వాటికలో వాటర్ ట్యాంక్, రేకులషెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

లాలం భవానీని కలిసిన సుందరపు



లాలం భవానీని సత్కరిస్తున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మార్చి 15: ఎలమంచిలి నియోజకవర్గ జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్ శుక్రవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానిని విశాఖలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి అభ్యర్థిగా తనను నిర్ణయించారని, తన గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం భవానిని విజయకుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

హాకీ టోర్నీలో డిగ్రీ విద్యార్థిని శిరీష కీలకపాత్ర

ఎలమంచిలి, మార్చి 15: రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీలో జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవడంతో తమ కళాశాల విద్యార్థి ఎం.శిరీష కీలకపాత్ర పోషించినట్టు గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి తెలిపారు. టోర్నీలో ప్రతిభ కనబర్చిన శిరీషను ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీని అధ్యాపక బృందం అభినందించింది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీపీ

ఎలమంచిలి, మార్చి 15: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. శుక్రవారం పోతిరెడ్డిపాలెం, రుక్మిణిపురం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను ఆయన ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, సర్పంచులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, పండు, నేతలు కొల్లి త్రినాథ్, రాజాన శ్రీను, కాళ్ల సీతారామ్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌కు పదోన్నతి

సబ్బవరం, మార్చి 15 : మండలంలోని మలునాయుడుపాలెం బీసీ హాస్టల్ వార్డెన్ వి.గోపీనాథరావుకు పదోన్నతి లభించింది. ఆయన్ని నర్సీపట్నం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియమిస్తూ శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ బీసీ వెల్ఫేర్ ఎ.కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు రావలమ్మపాలెం బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

లంకెలపాలెం, మార్చి 15: జీవీఎంసీ 84వ వార్డు పరిధిలోని సాలాపువానిపాలెంలో నూకాంబిక ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి, పూజలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో తీర్థాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలు ఛిన్నాభిన్నం!

- ఉపాధి కోల్పోయి గగ్గోలు పెడుతున్న వ్యాపారులు
- సిటీ క్లబ్ వద్ద తోపుడు బండ్లను తీయించిన నిర్వాహకులు
- ప్రత్యామ్నాయం చూపకపోవడంపై పలువురు ఆగ్రహం



ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద పెట్టిన తోపుడు బండ్లు

నర్సీపట్నం, మార్చి 15 : పట్టణంలో గత మూడు దశాబ్దాలుగా పాల్‌ఘాట్ సెంటర్‌లోని సిటీ క్లబ్ ప్రహరీ గోడను ఆనుకొని తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్న 30 మంది చిరువ్యాపారుల పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా మారింది. చెప్పులు, ఫ్యాన్సీ వస్తువులు, దుస్తులు, పండ్లు తదితరాలను తోపుడు బండ్ల మీద పెట్టుకొని ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా మునిసిపల్ అధికారులు సిటీ క్లబ్ ప్రహరీ గోడను తొలగించారు. సిటీ క్లబ్ ఆవరణలో అనుమతులు లేకుండా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. చిరు వ్యాపారులకు సంబంధించిన తోపుడు బండ్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడ్డు లేక పోవడంతో వారి జోలికి వెళ్లలేదు. అయితే బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతుల మీదుగా అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేసిన సంగతి తెలిసిందే. షాపుల ప్రారంభోత్సవం పేరుతో తోపుడు బండ్లను ముందు రోజు సాయంత్రం తీయించేశారు. తోపుడు బండ్లను ఖాళీ చేసి ఆర్డీవో కార్యాలయం గోడను ఆనుకొని పెట్టారు. ఆర్డీవో జయరాం తోపుడు బండ్లను వెంటనే తీయించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు హుటాహుటిన వచ్చి ఆర్డీవో కార్యాలయం గోడ వద్ద ఉన్న సదరు బండ్లను ఉన్నపళంగా తీయించేశారు. ముప్పై సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతున్న వారికి కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేశారని పలువురు చిరు వ్యాపారులతో పాటు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా వ్యాపారాలు బంద్ చేసుకుని, తోపుడు బండ్లు ఎక్కడ పెట్టుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం తోపుడు బండ్లు అన్నింటినీ పాల్‌ఘాట్ సెంటర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద పెట్టుకున్నారు. ప్రభుత్వ స్థలంలో సిటీ క్లబ్ నిర్వాహకులు అక్రమ నిర్మాణం చేస్తున్నారని సామాజిక కార్యకర్తలు రెండు నెలలుగా గగ్గోలు పెట్టినా పట్టించుకోని అధికార యంత్రాంగం, చిరు వ్యాపారుల విషయంలో ఎందుకు అంత కాఠిన్యం చూపించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తోపుడు బండ్లు పెడితే ఆక్రమణలు అయినప్పుడు, ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేసిన దుకాణ సముదాయం ఆక్రమణ కాదా.. అని ప్రశ్నిస్తున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణలో నష్టపోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాల్సిందిగా సదరు వ్యాపారులతో పాటు పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

3,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పట్టుబడిన బెల్లం ఊటను చూపుతున్న పోలీసులు

రావికమతం, మార్చి 15 : సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ ధనుంజనాయుడు తెలిపారు. గుమ్మళ్ళపాడు శివారులో సారా తయారీ జరుగుతున్నట్టు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడిచేయగా, 20 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో బెల్లం ఊటను ఉంచడాన్ని గుర్తించామన్నారు. అనంతరం దానిని ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

ముదిరిన రంగుల పిచ్చి

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా పార్టీ రంగులు, ఎన్నికల గుర్తులు వేయిస్తున్నారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధి కోట్నీవీధిలో విద్యుత్ స్తంభాలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలకు వైసీపీ రంగులు పులిమారు. వీటిని చూసిన స్థానికులు.. విద్యుత్ స్తంభాలను కూడా వదలరా? అంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇపుడు ప్రభుత్వ ఆస్తులను కూడా ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. అధికారం చేతిలో వుందన్న పొగరు, తాము ఏం చేసినా అధికారులు అడ్డుచెప్పరన్న ధీమాతోనే అధికార పార్టీ నేతలు ఇలా రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగావిద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మలపై వైసీపీ రంగులు, ఎన్నికల గుర్తులు వేయడంపై ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. గుర్తు తెలియని వ్యక్తులు వైసీపీ రంగులు వేసినట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని చెప్పారు.

ఎన్నికల యంత్రాంగం అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కేంద్ర సాయుధ బలగాలు (సీఐఎస్ఎఫ్) శుక్రవారం రోలుగుంట, పాయకరావుపేట మం డలాల్లోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు.



నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదాములో ఈవీఎంల పరిశీలన

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీ ఎంలు) చాలా రోజుల క్రితమే జిల్లాకు చేరాయి. వీటిని అనకాపల్లి మండలం శంకరం పరిధి జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో గోదాములో భద్రపరిచారు. వీటిని శుక్రవారం కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. గోదాముకు వేసిన సీల్, సీసీ టీవీ ఫుటేజీలను పరి శీలించారు. అనంతరం ఈవీఎంల గోదాము పక్కన ఉన్న ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన భవనం మొదటి, రెండు అంతస్తుల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. వీరి వెంట ఏఎస్పీ విజయభాస్కర్, డీఆర్వో దయానిధి, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రామ్మూర్తి, తదితరులు వున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఆర్.ధనుంజయ్, సిబ్బంది ఉన్నారు. కాగా ఎన్నికల నేపథ్యంలో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 350 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. అనుమానితులు, రౌడీలుగా గుర్తించిన 65 మందితోపాటు టీడీపీకి చెందిన 100 మంది, వైసీపీకి చెందిన 100 మంది, జనసేనకు చెందిన 35 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని చెప్పారు.

తుని-నర్సీపట్నం రోడ్డులో వాహనాలు తనిఖీ

నాతవరం పోలీసులు తుని-నర్సీపట్నం రోడ్డులో గన్నవరంమెట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనం నంబరును డైరీలో నమోదు చేస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్ల కూడదని, ఒకవేళ అధిక మొత్తంలో డబ్బు తీసుకెళుతూ పట్టుబడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరైన ఆధారాలు ఉంటే నగదును తిరిగి ఇచ్చేస్తామని, లేకపోతే నగదును సీజ్ చేసి ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామని ఏఎస్ఐ బంగార్రాజు తెలిపారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

- అభ్యర్థులు పెట్టే ఖర్చుపై ప్రత్యేక నిఘా
- ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారుల సమీక్షలో ఆర్డీవో జయరాం



ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 15 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత కోడ్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అధికారులకు సూచించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో ఏర్పాటైన సమావేశంలో వట్లాడారు. షెడ్యూల్ విడుదల తర్వాత రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి బ్యానర్లు, ఫెక్సీలు తొలగించాలని సూచించారు. అభ్యర్థుల పెట్టే ఎన్నికల ఖర్చు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిదీ వీడియో తీయించాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరడానికి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన తాతయ్యబాబు

- పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయానికి పనిచేయాలని సూచన



టీడీపీ అధినేత చంద్రబాబుతో తాతయ్యబాబు

చోడవరం, మార్చి 15 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై పోరాటంతో పాటు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నందుకు తనను అభినందించారని ఇక్కడి విలేకరులకు తాతయ్యబాబు తెలిపారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని సూచించినట్టు చెప్పారు.

'వైసీపీ విజయమే లక్ష్యం కావాలి'

బుచ్చెయ్యపేట, మార్చి 15 : ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని చోడవరం ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో పార్టీ కేడర్ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్ పర్సన్ సుంకర శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాటాన్ని గుర్తించాలి'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, మార్చి 15 : చోడవరం అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించేలా పార్టీ అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు పునరాలోచన చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలపై రాజీలేని పోరాటం చేయడంతో పాటు అధికార పార్టీ నిర్బంధాలను తట్టుకుని ఎదురు నిలుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు అల్లం రామప్పారావు, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, నరవ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పడం- మడమ తిప్పడం జగన్ నైజం

- చింతకాయల విజయ్



వైసీపీ నుంచి వచ్చేవారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విజయ్

గొలుగొండ, మార్చి 15 : మాట తప్పడం-మడమ తిప్పడం వైసీపీ నైజమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నుంచి స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ వరకు ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. మండలంలోని పాతమల్లంపేటలో శుక్రవారం రాత్రి టీడీపీ, జనసేన పార్టీలు నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. మైదాన ప్రాంత గిరిజనులకు నర్సీపట్నంలో మినీ ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మెల్యే గణేశ్‌ను ప్రశ్నించారు. మద్య నిషేధం అమలు చేస్తామన్న హామీ అటకెక్కిందని ఎద్దేవా చేశారు. పాతమల్లంపేట పంచాయతీ గదబపాలెం నుంచి నిమ్మగెడ్డ గ్రామాలకు మధ్యలో 150 మీటర్ల రోడ్డు ఏర్పాటు చేయలేని దుస్థితి ప్రస్తుతం నెలకొందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని వాపోయారు. అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్నప్పుడు సుమారు ఎనిమిది కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఇక్కడ చేపట్టారన్నారు. రాష్ట్రం మళ్లీ ప్రగతి పథాన పయనించాలంటే చంద్రబాబు వంటి సమర్థుడికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాతమల్లంపేట, కొత్తపాలెం, నిమ్మగెడ్డ గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్య క్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు ఆదపురెడ్డి గోపి, గెడ్డం ఆనంద్, సర్పంచ్ ఆదిలక్ష్మి, పారేపల్లి నాగేశ్వరరావు, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర, మండల అధ్యక్షుడు గండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

- పలు చోట్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు
- అక్కడివారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచార సేకరణ



వైబీపట్నంలో బందోబస్తుకు విచ్చేసిన కానిస్టేబుల్



సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన వైబీ పట్నం

నాతవరం, మార్చి 15 : సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వైబీ పట్నంలో నెల రోజుల కిందట టీడీపీ, వైసీపీ వర్గాలకు చెందిన నాయకులు కొట్టుకోవడంతో అప్పటి నుంచి రోజుకు ఇద్దరు చొప్పున పోలీసులు ఆ గ్రామంలో పహారా కాస్తున్నారు. అలాగే శృంగవరంలో బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు వారం రోజుల క్రితం దగ్ధం చేయడంతో గ్రామంలో రాజకీయ వేడెక్కింది. ఇక సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన గునుపూడి, మన్యపురట్ల, వల్లంపేట, మర్రిపాలెం, ములగపూడి గ్రామాల్లో పరిస్థితులపై పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నారు. వల్లంపేటలో ఇప్పటికే గొడవలు జరగడంతో తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్ఐ రామారావులు ఇటంశెట్టి శ్రీనివాస్ వర్గీయులపైనా, మాజీ సర్పంచ్ సుర్ల యోగి వర్గీయులపైనా మొత్తం 15మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

సుందరకోట పాఠశాలలో చదువులు ఘోరం

- ఉపాధ్యాయులపై ఎంపీడీవో రాంబాబు అసహనం



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నాతవరం, మార్చి 15 : సుందరకోట ప్రాథమిక పాఠశాలలో చదువులు ఘోరంగా ఉన్నాయని, ఇలా అయితే ఎలా అని అక్కడి ఉపాధ్యాయులపై ఎంపీడీవో జె.రాంబాబు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సదరు పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొన్నిపేర్లను బోర్డుపై రాయమని విద్యార్థులకు సూచించారు. కొందరు సరిగా రాయలేకపోవంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాల్సిందిగా సూచించారు. అనంతరం సరుగుడు సచివాలయంలో తడిచెత్త, పొడిచెత్త డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ గంగరాజు పంచాయతీ కార్యదర్శి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం'



పినకోట పీహెచ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న శాంతిప్రభ

దేవరాపల్లి, మార్చి 15 : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని జోనల్ మలేరియా ఆఫీసర్ ఎం.శాంతిప్రభ సూచించారు. శుక్రవారం కె.కోటపాడు సీహెచ్‌సీ, దేవరాపల్లి, పినకోట పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. దేవరాపల్లిలో వైద్యాధికారిణి డాక్టర్ వనజకు పలు సూచనలు చేశారు. అనంతరం పినకోట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో స్ప్రేయింగ్ పనులను పరిశీలించారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ ఎ.జె.సత్యనారాయణ, పినకోట వైద్యాధికారి డాక్టర్ డి.రూప్‌చంద్, ఎంపీహెచ్‌ఈవో బి.తిరుపతిరావు, సబ్ యూనిట్ అధికారి బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం'

చీడికాడ, మార్చి 15 : గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. దిబ్బపాలెం నుంచి దండి సురవరం, కట్టువాని అగ్రహారం జంక్షన్ వరకూ సుమారు రెండు కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీటీసీ దాకారపు పెద్దినాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్ల విల్లి రాజుబాబు, గొల్లవిల్లి స్వామి నాయుడు, కురచా నారాయణమూర్తి, నందారపు రమణ బాబు, ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో పార్కు నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి రాజేశ్ సాయం



నగదును అందిస్తున్న చింతకాయల రాజేశ్

మాకవరపాలెం, మార్చి 15 : మండలంలోని సీతన్న అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తికి నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ శుక్రవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన పల్లా కొండబాబు గత కొంత కాలంగా బ్రెయిన్‌స్ట్రోక్ కారణంగా అనారోగ్యం పాలయ్యాడు. ఈ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్టు తెలుసుకున్న రాజేశ్ తన సొంత డబ్బులను శుక్రవారం సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, జి.గంగవరం మాజీ సర్పంచ్ రమణ, జనసేన నాయకులు నానాజీ, రమణబాబు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కృష్ణాదేవి పేట, మార్చి 15 : ఏఎల్‌పురం గొల్లవీధి సమీపం బొడ్డేరుగెడ్డ వద్ద భక్తమార్కండేయ ఆలయ నిర్మాణానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. టీటీడీ నిధులు రూ.10 లక్షలు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుడుతున్నామని ఉప సర్పంచ్ కుండల చినతల్లి, ఎంపీటీసీలు మామిడి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల బుల్లి ప్రసాద్, పద్మశాలి చేనేత సంక్షేమ సేవా సంఘం సభ్యులు సుధా వరహాలరావు, ఆనందరావు, చింతలపూడి వెంకటేష్ ,రాపర్తి కృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

నాతవరం, మార్చి 15 : చమ్మచింత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ షైనం నాగగోపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఎంఈవో టి.అమృతకుమార్ సర్పంచ్ వెలగడ కొండబాబు, మాజీ ఎంపీటీసీ కె.నూకరాజు, ఉపాధ్యాయులు ఎస్.జగన్నాథరావు తదితరులుపాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా గణిత దినోత్సవం

చోడవరం, మార్చి 15 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణితంలో భారత దేశం ఇతర దేశాలకు స్ఫూర్తిగా ఉందని, ప్రపంచంలో గణిత మేధావులు మన దేశానికి చెందిన వారేనని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.కృష్ణారావు, పి.సుధీర్, అప్పలనాయుడు, సత్యవతి, నారాయణమూర్తి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మాకవరపాలెం, మార్చి 15 : లచ్చన్నపాలెంలో హత్యకు గురైన వలంటర్ హరినాథ్ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ పండ్ నుంచి మంజూరైన రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే గణేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పోతల వెంకునాయుడు, వైసీపీ నాయకులు బంకునాయుడు, సర్వేశ్వరావు, సాంబమూర్తి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'తపాలా శాఖ ద్వారా మెరుగైన సేవలు'

రావికమతం, మార్చి 15 : ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు తపాల శాఖ లక్ష్యసాధనలో గ్రామీణ తపాల శాఖ సిబ్బంది ముందుండాలని ఆశాఖ అనకాపల్లి డివిజన్ సూపరెంటెండెంట్ వి.సత్యనారాయణ సూచించారు. రావికమతం పోస్టాఫీస్‌లో పలు మండలాలకు చెందిన గ్రామీణ తపాల సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. ఐపీఓ కె.శ్రీనివాసరావు, ఐపీపీబీ మేనేజర్ బాంధవి, ఆర్‌పీఎల్ఐపీఎల్ఐ పలాసరావు, రావికమతం ఎస్‌పీఎం కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభ

... 5వ పేజీ తరువాయి

నాలుగు గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు సుమారు 70 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని పార్టీ నేతలు, ఇన్‌చార్జులకు బాధ్యతలను అప్పగించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం రెండు వేల మందిని తీసుకురావాలని నిర్దేశించారు. కాగా సభా ఏర్పాట్లను శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జపర్తి శ్రీనివాసరావు, ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేగి వెంకటేశ్, స్టేట్ యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు, విశాఖ నగర పార్టీ అధ్యక్షుడు గోవింద్, అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పరిశీలించారు.

హాస్టళ్లలో ఆకలి కేకలు

... 5వ పేజీ తరువాయి

చెల్లించడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. గతంలో ఒకటి, రెండు నెలలు ఆలస్యంగా బిల్లులు వచ్చేవని, కానీ కొంతకాలం నుంచి నాలుగు నెలలకు తక్కువ కాకుండా బిల్లులు పెండింగ్‌లో వుంటున్నాయని చెబుతున్నారు. దుకాణాల్లో అరువుపై సరకులు తెచ్చి, విద్యార్థులకు భోజనాలు వండి పెడుతు న్నామని, బకాయిలు పేరుకుపోవడంతో వ్యాపారులు కూడా అరువుపై సరకులు ఇవ్వడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని అంటున్నారని, కోడ్ అమల్లోకి వస్తే పెండింగ్ బిల్లుల చెల్లింపు జరగడం అనుమానమేనని అంటున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడేందుకు రెండు నెలలకుపైగా సమయం పడుతుందని, అంతవరకు బిల్లులు రాకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. కాగా వసతి గృహాలకు మెస్ బిల్లుల బకాయిల విషయాన్ని జిల్లా ఎస్సీ సాధికార అధికారి అజేయ్‌బాబు, బీసీ సాధికార అధికారి రాజేశ్వరి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా.. డైట్ బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు.

ప్రాణం తీసిన గతుకుల రోడ్డు

... 5వ పేజీ తరువాయి

దంపతులు. ఈశ్వరరావు కుల వృత్తిపై (బార్బర్ షాపు) ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం విశాఖ నగరంలోని గాజువాక ప్రాంతంలో బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరుకావడానికి భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఎం.కోటపాడు బయలుదేరారు. సుమారు ఏడున్నర గంటల సమయానికి వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో కేజేపురం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ రహదారి మొత్తం గోతులు ఏర్పడి పూర్తిగా ఛిద్రమైంది. గోతులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఇదే సమయంలో ఎలమంచిలి ప్రాంతంలోని ఒక కంపెనీ నుంచి సిమెంట్ లోడుతో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టుకు వెళుతున్న లారీ ఢీకొన్నది. దీంతో వాహనం నడుపుతున్న ఈశ్వరరావు ఎడమవైపునకు పడిపోగా, వెనకు కూర్చున్న సత్యవతి కుడివైపును పడిపోయింది. క్షణాల్లో లారీ ఆమె మీద నుంచి వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. ఈశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మృతురాలి కుమారుడు శివశంకర్ (గ్రామ వలంటీరు) ఇక్కడకు వచ్చి కన్నీరుమున్నీరు అయ్యాడు. ఎస్ఐ దామోదరనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ డేకల సింహాచలంనాయుడుని అదుపులో తీసుకున్నారు. శివశంకర్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఎం.కోటపాడు గ్రామం వుందని, ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారని, ఇంతలోనే సిమెంట్ లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆమెను కబళించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగుండి వుండే ఈ ప్రమాదం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు.